





ముంబయి విమానానికి ఘనస్వాగతం (ఇన్‌సెట్‌లో) బోర్డింగ్ పాస్ ఇస్తున్న ఎంపీలు



పరిహారంపై పరిహాసం

పెడనలో పంట పరిహారం పక్కదారిపై చర్యలు శూన్యం

- 152 మంది రైతులకు చెందిన రూ.40 లక్షలు స్వాహా
- పెడన మండల వ్యవసాయ అధికారుల నిర్వాకం
- రైతుల పేర్లు మార్చేసి, తమ బంధువుల ఖాతాల్లోకి..
- తూతూమంత్రంగా విచారణ చేసిన అధికారులు
- ఇద్దరు వీఏఏల సస్పెన్షన్‌తో సరి
- మండల అధికారిపై చర్యలకు మీనమేషాలు
- జిల్లా కార్యాలయ అధికారుల పాత్రపైనా అనుమానాలు

"రైతులకు అందాల్సిన పంట నష్టపరిహారాన్ని దిగమింగారు.. బ్యాంకు ఖాతా నెంబర్లు, ఆధార్ నెంబర్లు, భూమి వివరాలు మార్చేసి.. తమ బంధువుల ఖాతాకు పరిహార సొమ్ము బదలాయించుకున్నారు.. పెడన మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో జరిగిన ఈ అవకతవకలన్నీ వాస్తవమే అయినా, విచారణలో నిజమేనని తేలినా ఉన్నతాధికారులు మాత్రం తూతూమంత్రం విచారణ చేసి చేతులు దులుపుకోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మిచౌంగ్ తుఫాన్ కారణంగా పంట కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లింపులో జరిగిన అవకతవకలపై అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. పెడన మండలంలో జరిగిన ఈ అక్రమాలపై తూతూమంత్రంగా విచారణ చేసి చేతులు దులుపుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. వ్యవసాయ శాఖ అధికారులపై ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి పెరగడంతో విచారణను తూతూమంత్రంగా చేసి, పక్కన పెట్టేశారనే వాదన వినిపిస్తోంది. రైతులు కాని వారి ఖాతాల్లో పరిహారం నగదును జమ చేయించిన అనంతరం కొందరు వైసీపీ నాయకులు, వలంటీర్లు, వ్యవసాయ శాఖలో పనిచేసే సిబ్బంది ఇంటింటికీ వెళ్లి బ్యాంకు నుంచి డ్రా చేసిన నగదును వసూలు చేసుకున్నారు. దీంతో పరిహారం రాని రైతులు గతనెలలో వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. మండలంలోని పలు గ్రామాల పరిధిలో రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకూ పక్కదారి పట్టిందనే ఆరోపణలు ఉన్నాయి. అయితే, పరిహారం ఇప్పిస్తామని, కంగారు పడొద్దని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

పెడనలో దోచేశారు..!

అధికారుల ప్రాథమిక విచారణలో పెడన మండలంలోని నాలుగు గ్రామాల పరిధిలో పంట నష్టపరిహారం నగదు పక్కదారి పట్టినట్లు గుర్తించారు. రైతులు కాని 152 మంది ఖాతాల్లో రూ.40 లక్షల మేర జమ అయినట్లుగా తేల్చారు. పూర్తిస్థాయి విచారణ చేస్తే మరిన్ని వివరాలు బయటపడే అవకాశం ఉంది. మండల, డివిజన్ వ్యవసాయ శాఖ అధికారుల మొదటి తప్పుగా భావించి ఈ విచారణను ఇంతటితో సరిపెట్టేశారని వ్యవసాయ శాఖ అధికారులే చెబుతున్నారు. దీనిలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల పాత్ర కూడా ఉండటం వల్లే ఇలా చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఇద్దరు వీఏఏల సస్పెన్షన్

పెడన మండలంలో పంట నష్టపరిహారం పక్కదారి పట్టిన అంశం వెలుగులోకి రావడంతో వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయంలో పనిచేసే డీడీ, ఏడీని విచారణ అధికారులుగా నియమించారు. గత డిసెంబరులో మిచౌంగ్ తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన వారి జాబితాల తయారీలో జరిగిన అక్రమాలపై విచారణ చేశారు. జాబితాల తయారీలో అక్రమాలు జరిగినట్లుగా గుర్తించి, పెడన ఆర్బీకే వీఏఏ హరిత, పుల్లపాడు ఆర్బీకే వీఏఏ షాద్ అహ్మద్‌ను సస్పెండ్ చేశారు. మండల పరిధిలోని కట్లపల్లి, సింగరాయపాలెం, బల్లిపర్రు, మడక గ్రామాల్లోని జాబితాల్లో రైతులు కాని వారి ఖాతాల్లో నగదు జమ అయ్యింది. సస్పెన్షన్‌కు గురైన వారితో పాటు గతంలో పెడన మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిపై కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసిన వ్యక్తి ఈ జాబితాలు తయారు చేసినట్టు అధికారులు గుర్తించారు. జాబితాలు కనీసం పరిశీలించకుండానే పెడన మండల వ్యవసాయ శాఖ కార్యాలయం, మచిలీపట్నం సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయం నుంచి జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయానికి పంపారు. అక్కడి అధికారులు కూడా పరిశీలించకుండానే ఆమోదించారు.

ఏడీ, ఏవో ఒకరే..

మచిలీపట్నం వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ కార్యాలయ పరిధిలోనే పెడన మండలం కూడా ఉంది. పెడన మండల వ్యవసాయ శాఖ అధికారిగా ఉన్న జీవీ శ్రీనివాస్ మచిలీపట్నం సబ్ డివిజన్ ఏడీగానూ పనిచేస్తున్నారు. ఈయన కనుసన్నల్లోనే జాబితాలు తయారుచేశారు. మండల కార్యాలయంలో ఇద్దరు వీఏఏలు, ప్రైవేట్ కంప్యూటర్ ఆపరేటర్ కూడబలుక్కుని వారి బంధువుల పేర్లతో బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డు నెంబర్లను, భూమి వివరాలను తారుమారు చేసి జాబితాలను తయారుచేసినా ఆయన పట్టించుకోలేదు. దీని వెనుక కారణాలు ఏమై ఉంటాయనే అంశంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి

కమిషనర్‌కు నివేదిక పంపాం..

పెడన మండలంలో పంట నష్టపరిహారం విడుదలలో జరిగిన అక్రమాలపై ప్రాథమిక విచారణ చేశాం. మండలంలోని నాలుగు గ్రామాల్లో రూ.40 లక్షల మేర అవకతవకలు జరిగినట్లుగా ప్రాథమిక విచారణలో తేలింది. ఇప్పటికే ఇద్దరు వీఏఏలను సస్పెండ్ చేశాం. పెడన మండల వ్యవసాయ శాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు నివేదిక పంపాం.

- పద్మావతి, వ్యవసాయ శాఖ జేడీ

చలో ముంబయి

ఎయిరిండియా డైలీ ఫ్లైట్ ప్రారంభం

- రాత్రి 7.10 గంటలకు ముంబయికి బయల్దేరిన కొత్త సర్వీసు
- ఘనంగా స్వాగతం పలికిన సిబ్బంది
- సర్వీసును ప్రారంభించిన మచిలీపట్నం, విజయవాడ ఎంపీలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం) : రాష్ట్ర రాజధాని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దేశ ఆర్థిక రాజధాని ముంబయికి శనివారం రాత్రి 7.10 గంటలకు కొత్త విమాన సర్వీసు బయల్దేరింది. 180 సీట్ల సామర్థ్యంతో ఉన్న ఈ ఎయిరిండియా డైలీ ఫ్లైట్‌ను మచిలీపట్నం, విజయవాడ ఎంపీలు వల్లభనేని బాలశౌరి, కేశినేని చిన్ని ప్రారంభించారు. తొలిరోజు ముంబయి నుంచి 153 మంది ప్రయాణికులు విజయవాడకు రాగా, ఇక్కడి నుంచి 142 మంది ముంబయి వెళ్లారు. శనివారం సాయంత్రం 5.55 గంటలకు ఈ విమానం ముంబయి నుంచి విజయవాడకు వచ్చింది. ఇది రన్‌వేపై ల్యాండ్ కాగానే, ఎయిరిండియా అధికారులు నీళ్లు చల్లి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎయిర్‌పోర్టు టెర్మినల్ బిల్డింగ్‌లో కేక్ కట్ చేశారు. ఎంపీలు వల్లభనేని బాలశౌరి, కేశినేని చిన్ని ముఖ్య అతిథులుగా పాల్గొని విమాన సర్వీసును ప్రారంభించారు. ప్రయాణికులకు బోర్డింగ్ పాస్‌లు అందించారు. ఈ సందర్భంగా మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ కొత్త ప్రభుత్వ రాకతో రానున్న రోజుల్లో రాజధాని అమరావతి అభివృద్ధి చెందుతుందని, ఇక్కడికి విమాన సర్వీసులు పెంచాల్సిన బాధ్యత ఉందన్నారు. ఆ దిశగానే విజయవాడ విమానాశ్రయం నుంచి ముంబయి సర్వీసు ప్రారంభించామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సర్వీసులు తీసుకురావడానికి సమష్టిగా కృషి చేస్తామన్నారు. వారంలో రెండుసార్లు విశాఖపట్నం మీదుగా కోల్‌కతా, వారణాసి, షిర్డీకి విమానాలు తిరిగేలా చూస్తామని, సింగపూర్, థాయిలాండ్, శ్రీలంకతో పాటు ఢిల్లీకి మరో రెండు సర్వీసులు నడిచేలా చర్యలు తీసుకుంటామన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ ఇండిగో, ఎయిరిండియా సంస్థలతో మాట్లాడి, మరిన్ని సర్వీసులు పెంచే దిశగా ప్రయత్నాలు చేస్తామన్నారు. కొత్త టెర్మినల్ భవనం ఎనిమిది నెలల్లో పూర్తి చేస్తామని, సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. విజయవాడ ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ముంబయికి విమానం నడవడం ఆనందంగా ఉందని, ఢిల్లీకి విమాన సర్వీసులు పెంచడానికి సమష్టిగా కృషి చేస్తామన్నారు.

చిన్న పంపుల చెరువుపై చిన్నచూపు

- కట్ట తెగి మూడేళ్లు
- మరమ్మతులు చేయని వైసీపీ ప్రభుత్వం

6లో..

అమృతం కాదని..

బందరు అభివృద్ధిని అడ్డుకున్న పేర్ని నాని

"స్వకార్యాలను, అధినేత మెప్పు పొందే పార్టీ పనులను ఆగమేఘాలపై చేపట్టిన వైసీపీ నేతలు ప్రజలకు అవసరమైన వాటిని మాత్రం కక్షతో ఆపేసిన కథలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. బందరు పట్టణంలోని పేదల సమస్యలు తీర్చేందుకు విడుదలైన అమృత్ 2.0 నిధులకు మ్యాచింగ్ గ్రాంటు ఇవ్వకుండా అడ్డుకున్న మాజీ మంత్రి పేర్ని నాని.. అధినేత జగన్ మెప్పు కోసం ఇంద్రభవనాన్ని తలపించే వైసీపీ కార్యాలయ నిర్మాణాన్ని నిబంధనలు బేఖాతరు చేసి నిర్మించారన్న విషయం తాజాగా వెలుగుచూసింది."



బందరులోని వైసీపీ కృష్ణాజిల్లా కార్యాలయం

- అమృత్ నిధులు రూ.57.33 కోట్లకు అడ్డుపుల్ల
- ప్రభుత్వం నుంచి మ్యాచింగ్ గ్రాంట్ రాకుండా అడ్డు
- జనాల సొమ్ముతో వైసీపీ కార్యాలయ నిర్మాణం
- నిబంధనలు పక్కనపెట్టి రూ.కోట్ల స్థలం స్వాహా
- నిర్మాణానికి రూ.5 కోట్ల పైచిలుకు ఖర్చు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా వైసీపీ కార్యాలయం కోసం బందరు నడిబొడ్డున గజం రూ.40 వేలు పలికే ప్రాంతంలో సుమారు రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఈడేపల్లిలో జిల్లాజడ్జి బంగ్లా ఎదురుగా ఉన్న ఈ ఖరీదైన స్థలంలో ఆగమేఘాలపై ఇంద్రభవనంలాంటి వైసీపీ కార్యాలయాన్ని నిర్మించారు. దీనికోసం కేటాయించిన స్థలాన్ని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్న డిమాండ్లు ఊపందుకుంటున్నాయి. జిల్లా పార్టీ కార్యాలయానికి వెయ్యి గజాల స్థలమే ఎక్కువని, అలాంటిది రెండెకరాల ఖరీదైన స్థలం కేటాయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీ కార్యాలయాలకు ప్రభుత్వ స్థలాల కేటాయింపుపై ఆక్షేపణ లేకున్నా నగరం నడిబొడ్డున ఉండే ఖరీదైన స్థలాలు కేటాయించడంపై అప్పట్లోనే విమర్శలు వెల్లువెత్తాయి. కానీ, వాటిని వైసీపీ సర్కార్ బేఖాతరు చేసి జీవోలు విడుదల చేసింది.

బందరు అభివృద్ధికి మోకాలడ్డు


అమృత్ 2.0 కింద 2023, నవంబరులో సుమారు రూ.57.33 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో బందరు పట్టణంలో వెనుకబడిన వర్గాలు ఉండే కాలనీల్లో తాగునీటి సరఫరా, డ్రెయిన్ల నిర్మాణం, మురుగు, మంచినీటి చెరువు సమస్యలను పరిష్కరించుకోవాలి. రాజకీయ ఒత్తిళ్ల వల్ల ఈ నిధులకు మోక్షం కలగలేదు. సాక్షాత్తూ అప్పటి ఎమ్మెల్యే, మాజీమంత్రి పేర్ని నాని ఈ నిధులకు మోకాలడ్డారు. అమృత్ 2.0 నిధులు మంజూరైనా వాటికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి మ్యాచింగ్ గ్రాంట్ విడుదలైతేనే పనులు చేపట్టే అవకాశం ఉంటుంది. కానీ, మ్యాచింగ్ గ్రాంట్ రాకుండా పేర్ని నాని అడ్డుకున్నారు. ఈ విషయాన్ని అప్పటి వైసీపీ ఎంపీ బాలశౌరి వెల్లడించారు. కాగా, గత గురువారం సాయంత్రం ఎంపీ బాలశౌరి బందరు మున్సిపల్ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష జరిపారు. ఆ సమీక్షలో అధికారులు అమృత్ 2.0 నిధులకు మోక్షం కలగని వైనాన్ని ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆరా తీయగా, అధికారులు అసలు విషయాన్ని ఎంపీకి తెలిపి, రాజకీయ ఒత్తిళ్లతో తాము ఏమీ చేయలేని పరిస్థితి అని పేర్కొన్నారు.

జనాల సొమ్ముతో పార్టీ కార్యాలయం

మచిలీపట్నంలో నిర్మించిన వైసీపీ కార్యాలయానికి సుమారు రూ.5 కోట్లు వెచ్చించారని సమాచారం. ఈ మొత్తం సొమ్మును వ్యాపారుల నుంచి బలవంతంగా వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకున్న పేర్ని నాని.. అదే సమయంలో పార్టీ కార్యాలయాన్ని మాత్రం ఆగమేఘాలపై ఏడాదిలో పూర్తి చేయడం గమనార్హం. బందరును అభివృద్ధి చేస్తే ఆ క్రెడిట్ ఎంపీ ఖాతాలో పడుతుందనే ఆందోళనతో అసలు బందరులో అభివృద్ధి ఆనవాళ్లే లేకుండా చేసిన ఘనుడు పేర్ని నాని. బందరు పోర్టు నిర్మాణం విషయంలోనూ తొలి నాలుగేళ్లు సైలెంట్‌గా ఉండి, ఎన్నికల సంవత్సరంలో పనులు మొదలుపెట్టి, తామే బందరు పోర్టు నిర్మించేస్తున్నట్టు ప్రకటనలు ఇచ్చి హడావిడి చేశారు. తీరా అక్కడ బండరాళ్లు తప్ప అసలు నిర్మాణాలే ప్రారంభానికి నోచుకోలేదు. సహచర ఎంపీ బాలశౌరితో ఉన్న రాజకీయ విభేదాలకు బందరు పోర్టును బలిపశువును చేశారని సొంత పార్టీ నాయకులే విమర్శిస్తున్నారు. మచిలీపట్నంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) తప్ప మరో పెద్ద సంస్థ ఏదీ లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకుడిగా, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మచిలీపట్నం ఖ్యాతిని దశదిశలా చాటిన భోగరాజు పట్టాభి సీతారామయ్య పేరుతో స్మారక భవనం నిర్మించాలన్న ఆలోచనకు మచిలీపట్నం ఎంపీ బాలశౌరి ఊపిరి పోశారు. స్మారక భవనంతో పాటు మ్యూజియం, యువత ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేలా

- మిగతా 6లో

గుండెపోటుతో సీఐడీ ఎస్సై మృతి



పీవీ రమణ (ఫైల్)

పెనమలూరు, జూన్ 15 : కానూరు తులసీనగర్‌లోని సీఐడీ కార్యాలయంలో ఎస్సైగా పనిచేస్తున్న పీవీ రమణ (53) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్సై పీవీ రమణ స్వస్థలం కాకినాడ జిల్లా కోటనందూరు. ఇక్కడ ఒంటరిగా ఉంటూ ఉద్యోగం చేస్తున్నారు. గతంలో ఆర్మీలో పనిచేసి పదవీ విరమణ పొందారు. కాగా, శుక్రవారం ఉదయం ఆయన ఆఫీసుకు రాలేదు. సిబ్బంది ఎంతసేపు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. ఇంటికి వెళ్లి చూడగా, బాత్‌రూమ్‌లో స్పృహ కోల్పోయి కనిపించారు. దీంతో సిబ్బంది 108కి కాల్ చేయగా, వారు వచ్చి మృతిచెందినట్టు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

చిన్న పంపుల చెరువుపై చిన్నచూపు

కట్ట తెగి మూడేళ్లు ● మరమ్మతులు పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం

గుడివాడ చిన్న పంపుల చెరువుపై గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం పట్టణవాసుల పాలిట శాపంగా మారింది. గుడివాడకు తాను శాశ్వత ఎమ్మెల్యేనని చెప్పుకొన్న మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని పట్టణవాసుల నీటి కష్టాలను తీర్చాలనే ఆలోచన చేయలేదు. షాడో మంత్రిగా పేరు గాంచిన నాని ముఖ్య అనుచరుడు దుక్కిపాటి శశి అప్పుడప్పుడూ అధికారులతో సమీక్షలు నిర్వహించినా చేసింది శూన్యం. నాని మంత్రిగా ఉండగానే చిన్న చెరువు కట్ట తెగింది. కానీ మరమ్మతులు చేయలేదు. మూడేళ్లవుతున్నా చెరువు కట్ట అభివృద్ధికి అతీగతీ లేదు. టెండర్ దశలోనే ఉన్నట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

- అంచనాలు వేసినా ఇంకా టెండర్ దశలోనే
- గుడివాడ శివారు ప్రజలకు ట్యాంకర్లే దిక్కు

గుడివాడ: పట్టణవాసుల నీటి అవసరాలను తీర్చేందుకు 48, 105 ఎకరాల విస్తీర్ణంలో రెండు పంపుల చెరువులున్నాయి. మూడేళ్ల క్రితం చిన్న చెరువు కట్ట తెగిపోయింది. దీంతో లక్షలాది లీటర్ల మంచినీరు కాలువలు, డ్రెయిన్ల పాలైంది. మంత్రిగా ఉన్న కొడాలి నాని మరమ్మతులు చేస్తామని హడావుడి చేశారు. వెంటనే అంచనాలను తయారు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అంచనాలు తయారైనా మూడేళ్ల నుంచి టెండర్ దశలో ఉందని అధికారులు చెబుతున్నారు. కట్టకు మరమ్మతులు చేయడంపై కొడాలి నానీ శ్రద్ధ పెట్టలేదు. మున్సిపల్ అధికారులతో కట్టల పటిష్టతపై ఏనాడూ సమీక్ష జరిపిందీ లేదు. దీంతో ప్రభుత్వం, మున్సిపల్ అధికారుల్లో చలనం లేకుండాపోయింది.



వాటర్ ట్యాంకర్ వద్ద నీటి కోసం ప్రజల పాట్లు

కట్టల పటిష్టత అంతంతమాత్రమే

కట్టలు పటిష్టంగా లేకపోవడంతో పూర్తి సామర్థ్యంతో చెరువులను నింపాల్సిన అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. ఇప్పటికే చిన్న చెరువు కట్ట తెగి ఉంది. పెద్ద చెరువు కట్ట పటిష్టతపైనా అనుమానాలున్నాయి. దీంతో అధికారులు పెద్ద చెరువు నీటి సామర్థ్యం 1686 మిలియన్ లీటర్లు కాగా, 11 అడుగుల మేర నింపారు. కట్ట పటిష్టతపైన అనుమానంతోనే పూర్తి స్థాయిలో నింపలేదని అధికారులు చెబుతున్నారు. చిన్న చెరువు పూర్తి నీటి సామర్థ్యం 634 మిలియన్ లీటర్లు కాగా, 200 మిలియన్ లీటర్లే నింపారు. కట్ట తెగడంతో అంతంతమాత్రంగానే నీటిని నింపుతున్నారు.

కనీస అవసరాలకు నీరివ్వలేపోతున్నారు

పట్టణ ప్రజల దాహార్తిని తీర్చాలంటే రోజుకు 1.25 కోట్ల లీటర్ల నీరు అవసరం. దానికి అనుగుణంగా చెరువుల్లో నీటిని నింపుకోవాలి. చెరువు కట్టలు బలంగా లేకపోవడంతో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేయలేకపోతున్నారు. దీంతో తమకు నీరు అందడం లేదని శివారు ప్రాంత వాసులు గగ్గోలు పెడుతున్నారు. మునిసిపాలిటీ, స్వచ్ఛంద సంస్థలు అందించే నీరే దిక్కుగా మారిందంటున్నారు. పట్టణంలో టిడ్కో కాలనీ విలీనంతో నీటి కష్టాలు మరింత పెరిగాయి. రెండు రోజులకొకసారిని నీటిని సరఫరా చేసినా కాలనీవాసులకు సరిపోవడం లేదు. వెనిగండ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.



తెగిపోయిన చిన్న పంపుల చెరువు కట్ట

మరో సంప్‌వెల్ అవసరం

గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో హెడ్ వాటర్ వర్క్స్ వద్ద అండర్ గ్రౌండ్ సంప్‌వెల్‌ను నిర్మించారు. క్లోరినేషన్ అనంతరం నీటిని నిల్వ చేసేందుకు మరో సంప్‌వెల్ అవసరముంది. పట్టణంలోని 9 ఎలివేటెడ్ రిజర్వాయర్ల ద్వారా పట్టణవాసులకు నీటిని అందిస్తున్నారు. పూర్తిస్థాయిలో నింపకపోవడం, అవసరానికి తగ్గట్టుగా పంపింగ్ చేయలేకపోవడం, నిల్వ చేసుకునే వీలు లేకపోవడం, విద్యుత్ కోతలు వంటి కారణాలతో నీటిని అందించలేకపోతున్నారు. రెండు చెరువుల కట్టలను పటిష్ట పరచి పూర్తి సామర్థ్యంతో నీటిని నిల్వ చేస్తే సమస్య పరిష్కారమవుతుందని మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు తెలిపారు.

తాగునీటి సమస్య త్వరితగతిన పరిష్కరిస్తా

మంచినీటి కోసం పట్టణవాసులు పడుతున్న కష్టాలను ఎన్నికల ప్రచారంలో గమనించా. చిన చెరువు కట్ట తెగి మూడేళ్లవుతున్నా మరమ్మతులు చేయలేదు. మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని దీనిపై దృష్టి పెట్టలేదు. టెండర్లను త్వరితగతిన పిలిచి వెంటనే పనులు ప్రారంభిస్తాం. పంపింగ్‌కు అంతరాయం కలుగకుండా విద్యుత్ అధికారులతో మాట్లాడి నిరంతర విద్యుత్ సరఫరా అయ్యేలా చూస్తాం. మరో సంప్‌వెల్ అవసరాన్ని గుర్తించాం. పక్కా ప్రణాళికతో తాగునీటి సమస్య ఉత్పన్నమవ్వకుండా చూస్తాం.

- వెనిగండ్ల రాము, గుడివాడ ఎమ్మెల్యే



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో కేఎస్ రామారావు

దుర్గమ్మ సేవలో జస్టిస్ వి.శ్రీనివాస్

వన్‌టౌన్, జూన్ 15: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మను శనివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్ కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ ఈవో కేఎస్ రామారావు, అధికారులు వారికి సాదర స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాన్ని ఈవో అందజేశారు.



మొక్కులు తీర్చుకునేందుకు మోపిదేవి గుడికి వస్తున్న టీడీపీ, జనసేన నాయకులకు పులిగడ్డ బ్రిడ్జి వద్ద స్వాగతం పలుకుతున్న మండలి వెంకట్రామ్

టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిందని

బాపట్ల జిల్లా నుంచి మోపిదేవికి పాదయాత్ర

మోపిదేవి/అవనిగడ్డ రూరల్, జూన్ 15: టీడీపీ కూటమి అధికారంలోకి రావడం, బాపట్ల ఎమ్మెల్యేగా నరేంద్ర వర్మ గెలవడంతో బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం పెదపులుగువారిపాలెం నుంచి మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి శనివారం 100 మంది టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాదయాత్రగా తరలివచ్చి, స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం పులిగడ్డ బ్రిడ్జి వద్దకు చేరుకున్న వారికి నియోజకవర్గ యువనాయకుడు మండలి వెంకట్రామ్ ఘన స్వాగతం పలికి, ఘనంగా సత్కరించారు. అక్కడ నుంచి మోపిదేవి వార్పు వద్దకు చేరుకున్నాక టీడీపీ, జనసేన నేతలు ఘనస్వాగతం పలికారు. రాష్ట్రంలో ఐదేళ్లపాటు రాక్షస పాలన సాగిందని, దేవుళ్లంతా కూటమిని అధికారంలోకి తెచ్చి రాక్షస సంహారం చేశారని పాదయాత్రగా వచ్చిన వారు పేర్కొన్నారు. మోపిదేవిలో రావి రత్నగిరి, డొకిపర్తి బాలకోటేశ్వరరావు, భోగిరెడ్డి సాంబయ్య, ఉప్పాల యేసు, బల్లా సీతారామ ప్రసాద్ స్వాగతం పలికారు.

చేనేత సమస్యలు పరిష్కరించండి



మంత్రి సవితతో మాట్లాడుతున్న బొడ్డు వేణుగోపాలరావు

పెడన, జూన్ 15: చేనేత శాఖ రాష్ట్ర మంత్రి సవితను చేనేత ప్రముఖుడు, బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు శనివారం కలిశారు. చేనేత సమస్యలు, వాటి పరిష్కారం కోసం తీసుకోవలసిన చర్యలపై చర్చించేందుకు రావాలని సవిత ఆహ్వానించగా శనివారం ఆమె నివాసంలో వేణుగోపాలరావు కలిశారు. చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వేణుగోపాలరావు వివరించారు. చేనేత పరిశ్రమ అభివృద్ధి, కార్మికుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలను ఆమెకు సూచించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చేనేత కార్మికుల సంక్షేమానికి అమలు చేసిన పథకాలను వివరించారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని తెలిపారు. చేనేత పరిశ్రమపై రూపొందించిన సమగ్ర నివేదికను మంత్రికి వేణుగోపాలరావు అందజేశారు. మంత్రిని వేణుగోపాలరావు సత్కరించారు. మాజీ కౌన్సిలర్ యర్రా రాజా, చేనేత సంఘాల ప్రతినిధులు యక్కల నాగేశ్వరరావు, కుర్మా వాసు పాల్గొన్నారు.

ఐదు సంతకాలతో మాట నిలబెట్టుకున్న చంద్రబాబు

- టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు

మచిలీపట్నం టౌన్, జూన్ 15: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలి రోజే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేస్తూ ఐదు సంతకాలు చేసి చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారని టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు అన్నారు. శనివారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో 20 ఏళ్లు రాష్ట్రాభివృద్ధి వెనక్కి వెళ్లిందన్నారు. మళ్లీ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు చంద్రబాబు నడుం బిగించారన్నారు. అన్ని రంగాల ప్రజలు టీడీపీ కూటమికి బ్రహ్మరథం పట్టారన్నారు.

సీతనపల్లి ప్రమాదంపై అధికారుల ఆరా

- ప్రమాద స్థలం, వాహనాల పరిశీలన



ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కృత్తివెన్ను, జూన్ 15: సీతనపల్లి వద్ద 216 జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై శనివారం ఉన్నతాధికారులు ఆరా తీశారు. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా, మరో ఐదుగురు గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదం ఎలా జరిగింది. ప్రమాదానికి గల కారణాలు, వాహనాల పనితీరుపై విచారణ జరిపారు. రీజనల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎస్.శివరామప్రసాద్, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిద్ధిక్‌లు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరుపై స్థానిక ఎస్సై నాగరాజు నుంచి వివరాలు సేకరించి, ప్రాథమిక అంచనా వేశారు. అనంతరం స్టేషన్ పరిధిలోని వాహనాలను తనిఖీ చేశారు.



ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో గెలుపొందిన విజేతలతో డీఈవో తాహెరాసుల్తానా

వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు

మచిలీపట్నం టౌన్, జూన్ 15: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కృష్ణాజిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో విజేతలకు శనివారం డీఈవో తాహెరాసుల్తానా బహుమతులు అందజేశారు. విద్యాశాఖ కార్యాలయ సమావేశపు హాలులో బహుమతుల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయ విభాగం నుంచి వ్యాసరచన పోటీలో పాల్గొన్న అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ కె.కృష్ణవేణి ప్రథమ బహుమతి అందుకున్నారు. జిల్లా సీఈ బోర్డు సెక్రటరీ షేక్ జాన్‌సాహెబ్, ఘంటసాల ఎంఈవో మోమిన్, జిల్లా సైన్స్ ఆఫీసర్ జాకీర్‌అహమ్మద్, కో-ఆర్డినేటర్ సురేష్ కుమార్ పాల్గొన్నారు. ఎంఈవోలతో డీఈవో సమావేశం నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరంలో చేపట్టబోయే కార్యక్రమాలను సమీక్షించారు.

రాష్ట్ర ఆదాయానికి చెక్‌పెట్టారు

- రెండు నెలల క్రితం అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల మూసివేత
- వైసీపీ ప్రభుత్వ హయాంలో అనాలోచిత నిర్ణయం
- భారీగా ఆదాయం కోల్పోతున్న రాష్ట్రం
- గరికపాడు చెక్‌పోస్టుకు మూడుకిలోమీటర్ల దూరంలోని తెలంగాణలో యథావిధిగా నిర్వహణ



మూతబడిన గరికపాడు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు

జగ్గయ్యపేట రూరల్, జూన్ 15: రెండు నెలల క్రితం అంతర్రాష్ట్ర రవాణా చెక్‌పోస్టులను అప్పటి వైసీపీ ప్రభుత్వం తొలగించింది. ఈ అనాలోచిత నిర్ణయంతో రాష్ట్రం రూ.లక్షల ఆదాయం కోల్పోతోంది. ఇతర ప్రాంతాల నుంచి రాష్ట్రంలోకి వచ్చే వాహనాలు, రాష్ట్రం నుంచి బయటకు వెళ్లే వాహనాలు ట్యాక్స్ కట్టకుండానే రాకపోకలు సాగిస్తున్నాయి. 65వ నంబర్ జాతీయ రహదారి గరికపాడు సరిహద్దు చెక్‌పోస్టులో రోజుకు రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం వచ్చేది. జగ్గయ్యపేట పరిధిలోని సిమెంట్ ఫ్యాక్టరీల నుంచి సిమెంట్, ఫ్లైయాష్, బొగ్గు తదితరాలను పరిమితికి మించి తరలిస్తుండటంతో రూ.లక్షల్లో ప్రభుత్వ ఖజానాకు చిల్లు పడుతోంది. రాష్ట్రంలోకి వచ్చే వాహనాలు టెంపరరీ, పర్మినెంట్ ట్యాక్సులను చెక్‌పోస్టుల్లో చెల్లించేవారు. ఆ ఆదాయం రావడంలేదు. అధికారులు స్పందించి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని, ప్రజలు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఒకే దేశం ఒకే పన్ను విధానంతో చెక్‌పోస్టులు రద్దు చేశామని అప్పట్లో చెప్పినా, పక్కనున్న తెలంగాణలో మూడు కిలోమీటర్ల దూరంలో చెక్‌పోస్టు యథావిధిగా నడుస్తోంది.



గోవధ నిషేధంపై పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

గోవులు, దూడల వధ నేరం

- 14 ఏళ్లు దాటి వ్యవసాయానికి, బ్రీడ్ అభివృద్ధికి పనికిరాని ఎద్దు, దున్న, గేదెల వధకు పశువైద్యుడి అనుమతి తప్పనిసరి
- కబేళాలోకి ఒక జంతువుతో ఇద్దరికి మాత్రమే అనుమతి
- నగర వీధుల్లో పశువధ చేసి, మాంసం విక్రయిస్తే చర్యలు
- బక్రీద్ సందర్భంగా మార్గదర్శకాల విడుదల

విద్యాధరపురం, జూన్ 15: గోహత్య నిషేధ చట్టం అమలులో ఉందని గోవులు, దూడలను వధిస్తే కేసులు నమోదు చేస్తామని, అధికారులు హెచ్చరించారు. శనివారం భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డులోని ఫంక్షన్ హాలులో ఈనెల 17వ తేదీన బక్రీద్ సందర్భంగా భారీగా జంతుబలులు ఇచ్చే అవకాశం ఉన్నందున ప్రభుత్వ మార్గదర్శకాలను వివరిస్తూ భవానీపురం పోలీస్‌స్టేషన్, శాంతి కమిటీల ఆధ్వర్యంలో గోరక్షణ సమితి సభ్యులు, ఆహార భద్రతా విభాగం అధికారులు, సిబ్బంది, సంబంధిత విభాగాల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఎద్దు, దున్న, గేదే వంటి వాటిని వధించాలంటే వాటి వయస్సు 14 ఏళ్లు దాటి ఉండాలని వ్యవసాయానికి, బ్రీడ్ డెవలప్‌మెంట్‌కు పూర్తిగా పనికిరాకపోతేనే వధించాలని, అందుకు ప్రభుత్వ వైద్యుడి సర్టిఫికెట్ తీసుకుని, ప్రభుత్వ అనుమతి ఉన్న కబేళాలోనే వధించాలని సూచించారు. రోడ్లపైన, ఇళ్లలో ఎక్కడపడితే అక్కడ పశువులను వధించడం మాంసాన్ని విక్రయించడం నేరమని తెలిపారు. రెండేళ్లలోపున్న, అనారోగ్యం సోకి ప్రమాదంలో మరణించిన పశువులను వధించరాదన్నారు. కబేళాలోకి ఒక జంతువును మాత్రమే తీసుకురావాలని దానితో పాటు ఒకరు లేదా ఇద్దరికి అనుమతి ఉంటుందని తెలిపారు. బక్రీద్ సందర్భంగా విజయవాడ వీధుల్లో పశువులను వధించి వాటి మాంసాన్ని విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. బక్రీద్ సందర్భంగా పశువధ చేయడానికి విజయవాడ నగరపాలక సంస్థ కబేళాలో అన్ని సౌకర్యాలు కల్పించిందన్నారు. అనధికార పశువధ జరగకుండా నగరపాలక సంస్థ వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీసీపీ హరికృష్ణ, ఏసీపీలు మురళీకృష్ణారెడ్డి, రత్నరాజు, ఇతర విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులపై వేధింపుల నివారణ దినోత్సవంలో మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు

వృద్ధులకు ఆప్యాయత, ప్రేమానురాగాలు పంచుదాం

- వారిపై వేధింపుల నివారణకు పాటుపడదాం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు పిలుపు

కృష్ణలంక, జూన్ 15: "గొప్ప కుటుంబ వ్యవస్థకు నిలయమైన మన దేశంలో వృద్ధులపై వేధింపులు దురదృష్టకరం. వీటికి కారణాలను గుర్తించి, వేధింపులకు అడ్డుకట్ట వేద్దాం. వృద్ధులకు ఆప్యాయత, ప్రేమానురాగాలను పంచుదాం. వారి శ్రేయస్సుతోనే సమాజానికి ఉషస్సు" అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ప్రపంచ వృద్ధులపై వేధింపుల నివారణ, అవగాహన దినోత్సవం సందర్భంగా శనివారం గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో ఎన్టీఆర్ జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో వృద్ధులు గౌరవప్రద జీవితానికి భరోసా కల్పిద్దామని కలెక్టర్ పిలుపునిచ్చారు. వయోవృద్ధుల సంక్షేమ చట్టం-2007పై వయోవృద్ధులకు అవగాహన పెంపొందించి, వాటిని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. వేధింపులపై వృద్ధుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై డివిజన్ స్థాయిలో సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి కమిటీలు ఎప్పటికప్పుడు సమావేశమై నాణ్యమైన చర్చలతో మంచి ఫలితాలు వచ్చేలా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వేమూరు బాబురావు, కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు, హెల్పేజ్ ఇండియా ప్రతినిధి లంకపల్లి మృణాల్, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.చంద్రమౌళి, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ వి.కామరాజు, వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ డాక్టర్ బి.కీర్తి, డాక్టర్ సీఎల్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అమృతం కాదని..

(ఐదో పేజీ తరువాయి)

స్కిల్ సెంటర్ ఏర్పాటు చేశాలన్న ఆలోచనతో ఆంధ్రాబ్యాంకును విలీనం చేసుకున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉన్నతస్థాయి అధికారులతో బాలశౌరి పలుమార్లు సంప్రదింపులు జరిపారు. సుమారు రూ.70 కోట్లను మంజూరు చేయించారు. ఈ నిర్మాణ పనులకు మచిలీపట్నంలో రెండు ఎకరాలు కేటాయించాలని కోరినా పేర్ని నాని చివరి వరకు మోకాలడ్డుతూ వచ్చారు. స్మారక భవనం కోసం అడిగిన స్థలాన్నే పార్టీ కార్యాలయానికి కేటాయింపజేసుకుని అక్కడ ఆగమేఘాలపై నిర్మాణం చేపట్టారు. ఈ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని తక్షణం అక్కడ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనాన్ని నిర్మించాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఐదేళ్లు నాని పగబట్టారు : బాలశౌరి, ఎంపీ, మచిలీపట్నం

మచిలీపట్నం ప్రజలు 2019లో ఓట్లు వేసి గెలిపించినందుకు మాజీ ఎమ్మెల్యే పేర్ని నాని ప్రజలపై పగబట్టారని, బందరు అభివృద్ధి చెందకుండా ఐదేళ్లుగా కృషి చేశారని మచిలీపట్నం ఎంపీ బాలశౌరి వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. మచిలీపట్నంలో భూగర్భ డ్రెయినేజీ నిర్మాణానికి తాను చొరవ చూపి కేంద్రం నుంచి ఓ బృందాన్ని తీసుకొచ్చేందుకు సిద్ధం కాగా, వారిని రానివ్వకుండా మాజీ ఎమ్మెల్యే నాని అడ్డుకున్నారని విమర్శించారు. ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక ఆడిటోరియం నిర్మాణానికి స్థలం ఇవ్వకుండా వేధించారని, అంబేడ్కర్ భవన నిర్మాణ పనులను నిలిపివేయించారని ఆరోపించారు. ఎంపీ నిధులకు సంబంధించిన పనులు ముందుకు సాగకుండా అప్పటి జిల్లా కలెక్టర్లపై ఒత్తిడి తీసుకొచ్చారని మండిపడ్డారు. వైసీపీ వాళ్లు వైనాట్ 175 నినాదంతో అభాసుపాలయ్యారని, కానీ తాము మచిలీపట్నం అభివృద్ధే లక్ష్యంగా వైనాట్ మచిలీపట్నం నినాదంతో అడుగులు వేస్తామని, గతంలో నిలిచిపోయిన అన్ని అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.



మంత్రి కొల్లు రవీంద్రను సత్కరిస్తున్న పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

కృష్ణాజిల్లాను అభివృద్ధిపథంలో నడుపుదాం

- అధికారులు, ప్రజా ప్రతినిధులతో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 15: కృష్ణాజిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిద్దామని తనను కలిసిన ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులుతో మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, బందరు ఎంఈవో దుర్గాప్రసాద్, ఆర్టీసీ డిపో మేనేజరు పెద్దిరాజు తదితరులు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు కిట్ల పంపిణీపై ఎంఈవోతో మంత్రి చర్చించారు. మంత్రికి రంగనాయకస్వామి దేవాలయ కల్యాణోత్సవాల ఆహ్వానపత్రికను దేవదాయశాఖ ఈవో గోపాలరావు అందజేశారు. బచ్చుపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ ముక్కేవి రవికాంత్, టీడీపీ నాయకులు గుమ్మడి విద్యాసాగర్, కొరెడ్ల సుశీల శుభాకాంక్షలు తెలిపారు. పలువురు టీడీపీ, జనసేన నాయకులు రవీంద్రను కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి సత్కరించారు.

ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద మృతి

గుణదల, జూన్ 15: గూడవల్లిలోని ఓ కార్పొరేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ రెండో సంవత్సరం చదువుతున్న బి.జాహ్నవి(17) అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్టు పటమట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. "అనంతపురానికి చెందిన బి.జాహ్నవి కళాశాల హాస్టల్‌లో శనివారం ఉదయం స్నానానికి బాత్రూంలోకి వెళ్లి ఎంతకీ బయటికి రాలేదు. దీంతో తోటి విద్యార్థినులు కళాశాల సిబ్బందికి తెలియజేశారు. వారు అక్కడికి చేరుకుని బాత్రూం డోర్ బద్దలుకొట్టి స్పృహ కోల్పోయి ఉన్న జాహ్నవిని బయటికి తీశారు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయిందని వైద్యులు నిర్ధారించారు. జాహ్నవికి గుండెపోటు గాని, బ్రెయిన్‌డెడ్ గాని జరిగి ఉండవచ్చని కళాశాల యాజమాన్యం తెలిపింది." అని పోలీసులు తెలిపారు. గుంటూరులో ఉంటున్న జాహ్నవి మేనమామ సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పటమట సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. విద్యార్థిని మృతి వార్త తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వాస్పత్రి మార్చురీకి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

భార్యపై కత్తితో దాడి..భర్త పరారీ

జి.కొండూరు, జూన్ 15: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యపై భర్త కత్తితో దాడి చేసి పరారయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం మైలవరం మండలం పొందుగల గ్రామానికి చెందిన ఈరిశెట్టి రంగారావుకు కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం మానికొండ గ్రామానికి చెందిన రత్నకుమారితో 20 ఏళ్లక్రితం వివాహమైంది. వారికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరి మధ్య కొంత కాలంగా విభేదాలు ఉన్నాయి. దీంతో జి.కొండూరు మండలం చెవుటూరులో ఉంటున్న తన అక్క వద్ద రత్నకుమారి తలదాచుకుంటోంది. శుక్రవారం భార్యను కాపురానికి పంపాలని చెవుటూరు వచ్చి రంగారావు గొడవకు దిగాడు. గొడవ జరుగుతుండగానే కత్తితో రత్నకుమారిపై దాడి చేసి, పరారయ్యాడు. గాయపడిన ఆమెను బంధువులు చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నారు.

నేడు సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్(యూపీఎస్సీ) నేతృత్వంలో నగరంలో ఆదివారం సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలకు 11,112 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. 25 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పేపర్-2 పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల పర్యవేక్షణకు ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం 25 మంది రూట్ ఆఫీసర్లను, 25 మంది సహాయ సూపర్‌వైజర్లను నియమించింది.

గురుకుల విద్యాలయాల్లో

ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు

మచిలీపట్నం టౌన్, జూన్ 15: కృష్ణాజిల్లాలోని గురుకుల విద్యాలయాల్లో 5, 6, 7, 8 తరగతుల్లో ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. 5వ తరగతిలో 58, 6లో 53, 7లో 50, 8లో 50 సీట్లు ఖాళీగా ఉన్నాయని వివరాలకు గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ పీపీఎస్ రాజేంద్రప్రసాద్‌ను 8712625035లో సంప్రదించాలన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	152, 161, 172
చికెన్ విత్ స్కిన్	296
చికెన్ స్కిన్‌లెస్	306

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.80

బ్యాటరీల షాపు దగ్ధం చేసేందుకు యత్నం

గన్నవరం, జూన్ 15 : కొత్తపేటలోని భవిత బ్యాటరీల షాపును పెట్రోల్ పోసి దగ్ధం చేసేందుకు గుర్తుతెలియని దుండగలు యత్నించారు. శుక్రవారం అర్ధరాత్రి షాపుపై భాగానికి ఎక్కి రేకు పగలకొట్టి అతని వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను షాపులో ఉన్న బ్యాటరీలు, ఇన్వర్టర్లపై పోసి నిప్పు పెట్టే ప్రయత్నంలో సౌండ్ రావటంతో బిల్డింగ్ యజమాని కేకలు వేశారు. దీంతో దుండగుడు పారిపోయాడు. వెంటనే షాపు నిర్వాహకుడు హరికుమార్‌కు సమాచారం ఇవ్వడంతో షాపు వద్దకు వచ్చాడు. పరిశీలించగాపై రేకును పగలకొట్టినట్లు గుర్తించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు వచ్చి సీసీ టీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. గతంలో సరిహద్దు చిన నాగయ్య దగ్గర పనిచేసి మానేశానని అతను ఎవరితోనైనా చేయించి ఉంటాడని భావిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



హనుమాన్ చాలీసాను పఠిస్తున్న భక్తులు

పోరంకి ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా

పెనమలూరు, జూన్ 15 : రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు, పెనమలూరు ఎమ్మెల్యేగా బోడె ప్రసాద్ ఎన్నికైన సందర్భంగా పోరంకి ఆంజనేయ స్వామి ఆలయంలో టీడీపీ నాయకురాలు, టీడీపీ 8వ డివిజన్ అధ్యక్షురాలు దండమూడి సాయిసుధ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసాను పఠించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీ శివలలితా మండలి సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అవరోధం కల్పించొద్దు



ట్రాఫిక్‌పై సూచనలు ఇస్తున్న పట్టణ ఎస్సై గణేశ్‌కుమార్

ఉయ్యూరు, జూన్ 15 : రోడ్డుపై వాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని పట్టణ ఎస్సై గణేశ్ కుమార్ హెచ్చరించారు. పట్టణ ప్రధాన రోడ్ల పై ద్విచక్రవాహనాలు, ఆటోలు, వ్యాన్‌లు నిలిపి ట్రాఫిక్ అవరోధం కలిగిస్తున్న వారికి జరిమానా విధించి స్టేషన్‌కు పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. రోడ్డుపక్కన, మధ్యలో వాహనాలు అడ్డంగా నిలపడంవల్ల ట్రాఫిక్ అవరోధంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఒక్కసారి కౌన్సిలింగ్ చేసిన వారు తిరిగి అదే విధంగా ప్రవర్తిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గంపలమ్మే వృద్ధుడు మృతి

వన్‌టౌన్, జూన్ 15 : యనమలకుదురుకు చెందిన మేడం అంజయ్య (73) శనివారం వారధి సమీపంలో మృతి చెందినట్టు కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురు విశ్వశాంతి నగర్‌కు చెందిన ఎం.అంజయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. అంజయ్య గంపలమ్ముకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఇతను శనివారం నడుచుకుంటూ వారధి దగ్గర ఉన్న గుంటూరు బస్‌స్టాప్ వద్దకు వెళుతుండగా అమరావతి స్థూపం వద్దకు వచ్చేటప్పటికే స్పృహ తప్పి కిందపడిపోయాడు. అక్కడున్న ఆటోడ్రైవర్లు, పాదాచారులు అతనిని పరిశీలించగా నోటి నుంచి రక్తం కారుతుండడంతో పలువురు 108కు పిలిపించారు. 108 సిబ్బంది పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అంగన్వాడీల్లో పిల్లలను చేర్పించండి

ఉయ్యూరు, జూన్ 15 : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించి ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో సుకన్య అన్నారు. సుందరమ్మపేట 2వ అంగన్‌వాడీ కేంద్రంలో పీపీ1, పీపీ2 కోర్సులు పూర్తిచేసుకున్న అంగన్‌వాడీ విద్యార్థులకు శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. పిల్లలను అన్ని హంగులు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని 12వ వార్డు కౌన్సిలర్ బూరెల రమణ కోరారు.

బాబు పాలనలో అభివృద్ధి పరుగులు

మొక్కులు చెల్లించుకుంటున్న కూటమి శ్రేణులు

హనుమాన్‌జంక్షన్, జూన్ 15 : చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పాలన పగ్గాలు చేపట్టడంతో రాష్ట్ర అభివృద్ధికి ఇక పరుగులు పెడుతుందని తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి తెలిపారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన సందర్భంగా మొక్కు తీర్చుకోవడానికి సాయికల్యాణి శనివారం ద్వారక తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. ముందుగా ఆమె స్థానిక అభయాంజనేయస్వామిని దర్శనం చేసుకొని కాలినడక ప్రారంభించారు. టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, వేగిరెడ్డి పాపారావు, వడ్డిల్లి లక్ష్మి, గండేపూడి నితీష్ కుమార్, గండి రాంబాబు తదితరులు సాయికల్యాణికి అభినందనలు తెలియజేసి పాదయాత్రకు వీడ్కోలు పలికారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : అరాచకపాలనకు ప్రజలు చరమగీతం పాడి అభివృద్ధికర పాలన అందించే కూటమికి పట్టం కట్టడంతో ఉమామహేశ్వరపురం, కోడూరుపాడుకి చెందిన టీడీపీ నాయకులు శనివారం మొక్కులు చెల్లించుకున్నారు. చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి తిరిగి పూర్వవైభవం సంతరించుకునేలా యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో గన్నవరం నియోజకవర్గంలోని ప్రజలు శాంతిసౌఖ్యాలతో విలసిల్లుతూ నియోజకవర్గ అభివృద్ధి జరిగేలా భగవంతుడు ఆశీర్వదించాలని ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. కోడూరుపాడుకు చెందిన టీఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు పాండురంగారావు, లలితకుమారి దంపతులు వీరవల్లిలోని కనకదుర్గమ్మకు పసుపు, కుంకుమ, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమామహేశ్వరపురానికి చెందిన టీడీపీ నాయకులు పోలిమెట్ల వాసు, రవికుమార్, అర్నేపల్లి వెంకటేశ్వరరావు, గంధి రాంబాబులు పెదఅవుటపల్లిలోని జోసఫ్‌తంబి చర్చిలో మొక్కులు చెల్లించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



కాలినడకన ద్వారకా తిరుమల వెళ్తున్న టీడీపీ నాయకులు



పెదఅవుటపల్లి జోసఫ్‌తంబి చర్చిలో..

సైకిల్‌పై అన్నవరం..

ఉంగుటూరు : వైసీపీ ఐదేళ్ల అస్తవ్యస్త పాలనలో భ్రష్టుపట్టిన రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించి, స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దగల సమర్థవంతమైన నాయకత్వం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికే వుందని ప్రజలు బలంగా విశ్వసించబట్టే అఖండ మెజారిటీతో ఆశీర్వదించి చారిత్రాత్మక విజయాన్ని సొంతం చేశారని తేలప్రోలు జనసేన కార్యకర్త చింతల అప్పారావు (36)అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి భారీ మెజారిటీతో గెలుపొంది, ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రిగా పవన్‌కళ్యాణ్ బాధ్యతలు చేపడితే తేలప్రోలునుంచి అన్నవరం(సుమారు 220 కిలో మీటర్లు)కు సైకిల్‌పై వచ్చి తన తలనీలాలు సమర్పిస్తానని పోలింగ్ రోజున సత్యనారాయణస్వామికి అప్పారావు మొక్కుకున్నాడు, ఆ స్వామి చల్లని దీవెనలతో ఎన్డీఏ కూటమి అధికారం చేపట్టడంతో శుక్రవారం ఉదయం 4 గంటలకు తన సొంత సైకిల్‌పై తేలప్రోలు నుంచి అన్నవరం యాత్రకు బయలు దేరాడు, అక్కడక్కడ విశ్రాంతి తీసుకుంటూ శనివారం ఉదయం 8 గంటలకు అన్నవరం చేరుకుని సత్యదేవుని దర్శనం చేసుకుని మొక్కులు సమర్పించుకున్నాడు.



సైకిల్‌పై అన్నవరం వెళ్తున్న జనసేన కార్యకర్త అప్పారావు



రక్తదానం చేస్తున్న వైద్య విద్యార్థినులు

రక్తదానం ప్రాణదానంతో సమానం

గన్నవరం, జూన్ 15 : రక్తదానం ప్రాణదానంతో సమానమని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల బోధనాస్పత్రిలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శనివారం వైద్య విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ, సరైన సమయంలో రక్తదానం చేయటం వల్ల ఎన్నో ప్రాణాలనను కాపాడుకోవచ్చన్నారు. ఏడాదికి రెండు సార్లు రక్తదానం చేయొచ్చన్నారు. పాథాలజీ విభాగాధిపతి డాక్టర్ డి.నవీన్‌చంద్ర, జాస్మిన్ సుల్తానా పాల్గొన్నారు.

రామోజీరావుకు ఘన నివాళి

పెనమలూరు, జూన్ 15 : ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావుకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావులు నివాళులర్పించారు. శనివారం ఉదయం రామోజీ ఫిల్మ్ సిటీలో రామోజీరావు చిత్రపటానికి వారు శ్రద్ధాంజలి ఘటించి రామోజీరావు కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పర్యావరణంపై అవగాహన ఉండాలి

విద్యార్థులకు పుస్తకాల పంపిణీలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, జూన్ 15 : విద్యార్థి దశ నుంచే పర్యావరణం పట్ల విద్యార్థులు అవగాహనతో ఉండాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మొక్కలు నాటి వాటిని రక్షించే బాధ్యతను విద్యార్థులు తీసుకోవాలని ఉద్బోధించారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు.



పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న బోడె ప్రసాద్

బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో..

హనుమాన్‌జంక్షన్ : ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి కృషి చేయాలని బాపులపాడు జడ్పీ హైస్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ సుంకర సుభాష్ చంద్రబోస్ అన్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన స్టూడెంట్ కిట్స్‌ను బాపులపాడు స్కూల్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈ ఏడాది పదవ తరగతిలో 500 మార్కులు సాధించిన 8 మంది విద్యార్థులకు శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ప్రతి విద్యార్థికి రూ.5వేలు చొప్పున రూ.40వేలు ఉపకార వేతనాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ వైనగేష్, జడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, సర్పంచ్ సరిపల్లి కమలాబాయి, దుట్టా శివన్నారాయణ, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, హెచ్‌ఎం. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జూలై 12 వరకు నేను బడికి పోతా..

బడి ఈడు పిల్లలందరిని బడికి పంపించే నేడు బడికి పోతా కార్యక్రమం జూలై 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు బాపులపాడు ఎంఈవోలు రాంబాలాసింగ్, బి.సురేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అందించిన స్టూడెంట్ కిట్స్ అన్ని పాఠశాలలకు పంపిణీ చేసినట్లు తెలిపారు.

స్వేచ్ఛగా పనిచేయండి

కంకిపాడు : రాష్ట్రంలో ప్రభుత్వం మారిందని, ఉపాధ్యాయులు స్వేచ్ఛగా తమ పనులు తాము నిర్వహించాలని ఈడుపుగల్లు సర్పంచ్ పందిపాటి ఇందిర అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను శనివారం ఆమె పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి పందిపాటి సుధాకర్, వార్డు సభ్యులు షేక్ షకార్, సుంకర శ్రీహరి, అనుమోలు రామకృష్ణ, మైనేని భవాని, ఉపాధ్యాయులు మండవ శ్రీనివాసు, రూపవాణి, మీనా కుమారి పాల్గొన్నారు.



బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో..



ఈడుపుగల్లు ప్రాథమిక పాఠశాలలో..

యువతకు స్ఫూర్తి ఏబీవీ



ఏబీవీని సత్కరిస్తున్న మల్లవల్లి టీడీపీ నాయకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 15 : నిజాయితీకి నిలువు టద్దంలా నిబద్ధతతో అరాచక ప్రభుత్వంపై పోరాడి విధులు నిర్వహించిన విశ్రాంత డీజీ ఏబీ వెంకటేశ్వరరావు పోరాటం యువతకు స్ఫూర్తి అని టీడీపీ అధ్యక్షుడు యనమదల వెంకయ్యారావు అన్నారు. మల్లవల్లికి చెందిన టీడీపీ, మైనారిటీ నాయకులు శనివారం నూజివీడులో విశ్రాంత డీజీ ఏబీవీని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాన్ బాషా, పెదబుడే, వలీ, కాలే మస్తాన్, చల్లగుళ్ల ప్రవీణ్, గోవింద్ పాల్గొన్నారు.

మంత్రి పార్థసారథికి సత్కారం

కంకిపాడు, జూన్ 15 : మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కొలుసు పార్థసారథిని కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజా శనివారం ఘనంగా సత్కరించారు. అదే విధంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సారథిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అదే విధంగా ప్రజాదరణ పొందిన చింతామణి నాటకంపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలని స్నేహలత ఆర్ట్ అధ్యక్షులు బొజ్జ గౌరీశంకర్, ప్రతినిధులు రావి వెంకట్, ఆచంట బాలాజీలు మంత్రి సారథికి విజ్ఞప్తి చేశారు.



పార్థసారథికి శుభాకాంక్షలు తెలుపుతున్న ముదునూరు టీడీపీ నాయకులు.. సారథిని సత్కరించిన దేవినేని రాజా

ముదునూరు నేతల శుభాకాంక్షలు ..

ఉయ్యూరు : మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన నూజివీడు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథికి ముదునూరు పీఏసీఎస్ మాజీ చైర్ పర్సన్, టీడీపీ నాయకుడు పాలడుగు సత్యనారాయణ, ముదునూరు మాజీ సర్పంచ్ పల్లపోతు శ్రీనివాసరావు, జనసేన నాయకుడు దాకారపు అజయ్‌బాబు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం విజయవాడలో పార్థసారథిని కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గృహనిర్మాణ శాఖ మంత్రిగా పేదలకు ప్రభుత్వం నుంచి పక్కా ఇళ్ల నిర్మాణానికి కృషి చేసి వారికి గూడు కల్పించి భవిష్యత్తులో మరిన్ని పేరు ప్రఖ్యాతులు గడించాలని ఆకాంక్షించారు.

సమష్టి కృషితోనే టీడీపీ విజయం

పెనమలూరు, జూన్ 15 : టీడీపీ కార్యకర్తల సమష్టి కృషి వల్లే నిన్నటి ఎన్నికల్లో టీడీపీ అత్యంత భారీ విజయాన్ని నమోదు చేసిందని టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు పేర్కొన్నారు. శనివారం కానూరు టీడీపీ కార్యాలయంలో జరిగిన వార్డు, డివిజన్ అధ్యక్షుల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలు తమ చమటోడ్చి సాధించుకున్న విజయం అత్యంత విలువైనదిగా భావించాలన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే చంద్రబాబు అత్యంత విలువైన ఐదు సంక్షేమ పథకాలపై సంతకాలు చేయడం చారిత్రకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో షేక్ బుజ్జి, ఇమాం, రఫీ, సమీర్, ఇక్బాల్, రెహమాన్, సుంకర సాయి, పవన్, రియాజ్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



కానూరు టీడీపీ కార్యాలయంలో వార్డు, డివిజన్ అధ్యక్షులను సన్మానిస్తున్న వెలగపూడి శంకరబాబు

అందరికీ సంక్షేమ ఫలాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 15 : టీడీపీ కూటమి ప్రభుత్వానికి ప్రజాసంక్షేమంతో పాటు అభివృద్ధి రెండు కళ్లలాంటివని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చూడటం ప్రతి ఉద్యోగి కర్తవ్యమని గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుండపనేని ఉమావర ప్రసాద్ సూచించారు. వీరవల్లి పీఏసీఎస్ హాల్‌లో సర్పంచ్ పిల్లా అనిత అధ్యక్షతన శనివారం వివిధశాఖల ఉద్యోగులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లంక సురేంద్ర మోహనబెనర్జీ, అజయ్, అమృత పల్లి సూర్యనారాయణ, నందమూరి మురళీకృష్ణప్రసాద్, పిల్లా రామారావు మండాది రవీంద్ర, కలపాల శ్రీధర్, కలపాల నాని, ఈడ శ్యామలరావు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రవీంద్రకు సన్మానం



పెనమలూరు : రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రిగా నియమితులైన కొల్లు రవీంద్రకు తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర శనివారం శుభాకాంక్షలు తెలిపారు. కుమారుడు యార్లగడ్డ మోహనకృష్ణతో కలిసి ఆయన ఇంటికి వెళ్లిన సుచిత్ర మంత్రిని శాలువాతో సత్కరించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	152, 161, 172
చికెన్ విత్ స్కిన్	296
చికెన్ స్కిన్‌లెస్	306

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.80



సీఎం చంద్రబాబుకు వేదవ్యాస్ శుభాకాంక్షలు



మచిలీపట్నం టౌన్, జూన్ 15 : రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబునాయుడును శనివారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో చంద్రబాబును కలిసి జిల్లాలో టీడీపీ క్లీన్‌స్వీప్‌కు కృషి చేసిన వైనాన్ని వివరించారు. పార్టీ విజయానికి శ్రమించిన వేదవ్యాస్‌ను చంద్రబాబు అభినందించారు.

మంత్రి రవీంద్ర ఆధ్వర్యంలో వైభవంగా సుదర్శన యాగం

మచిలీపట్నం టౌన్, జూన్ 15 : లోక కళ్యాణార్థ బందరుకోట కోదండ రామస్వామి దేవస్థానంలో శనివారం రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర, నీలిమ దంపతులు భక్తి శ్రద్ధలతో సుదర్శనయాగం నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ బచ్చుల అనిల్ కుమార్, దేవదాయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, టీడీపీ కార్పొరేటర్లు మరకాని సమతా కీర్తి, చిత్త జల్లు నాగరాము, టీడీపీ నాయకులు మరకాని పరబ్రహ్మం, లంకే శేషగిరి, లంకే నారాయణ ప్రసాద్, కాగిత వెంకటేశ్వరరావు, ఎండీ ఇలియాస్ బాషా, పిప్పళ్ల కాంతారావు, కుంచే నాని, కాగిత గోపాలరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.



సుదర్శనయాగంలో పాల్గొంటున్న మంత్రి రవీంద్ర దంపతులు

అన్న క్యాంటీన్ పునరుద్ధరణకు చర్యలు

మచిలీపట్నంలో గతంలో మూడు స్తంభాల సెంటర్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను పునరుద్ధరించేందుకు మంత్రి కొల్లు రవీంద్ర చర్యలు చేపట్టారు. శనివారం మునిసిపల్ కమిషనర్ బాపిరాజుతో కలసి చర్చించి అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. చంద్రబాబు పిలుపుమేరకు అన్న క్యాంటీన్లు పునరుద్ధరిస్తున్నామన్నారు.

వి.ఎం.రంగా త్యాగాలు మరువలేనివి

మచిలీపట్నం టౌన్ : వంగవీటి రంగా పేద ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రేవతీసెంటర్‌లోని రంగా విగ్రహానికి కొల్లు రవీంద్ర శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ, రాధా రంగా మిత్ర మండలి రాష్ట్ర అధ్యక్షుడు బుల్లెట్ ధర్మారావు, లంకిశెట్టి నీరజ, మాదివాడ రాముపాల్గొన్నారు.

బ్రాహ్మణ సంక్షేమంపై దృష్టి సారిస్తా

వైసీపీ హయాంలో బ్రాహ్మణ కార్పొరేషన్ నిర్వీర్యమైందని, తిరిగి బ్రాహ్మణ కార్పొరేషన్‌కు పునరుజ్జీవం కల్పిస్తామని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంత్రిని తెలంగాణా బ్రాహ్మణ సంఘం నాయకుడు, వేదపాఠశాల వ్యవస్థాపకుడు శివప్రసాద్, టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా కన్వీనర్ పి.వి. ఫణికుమార్ కలిశారు. కొల్లు రవీంద్రకు బ్రాహ్మణ, అర్చక సమస్యలను వివరించారు. పొట్టకూటి కోసం తెలంగాణా వెళ్లిన అర్చకులందరూ మచిలీపట్నం వచ్చి ఎన్డీఏ కూటమికి ఓటు వేశారన్నారు. భాస్కరశర్మ పాల్గొన్నారు.



వడ్లమన్నాడులో జనసైనికుల సంబరాలు

గుడ్లవల్లేరు : జనసేనాని కొణిదల పవన్ కల్యాణ్ కు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి తో పాటు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి వంటి కీలకమైన శాఖలు ఇవ్వడం పట్ల జనసైనికులు హర్షం వ్యక్తం చేశారు. వడ్లమన్నాడులో కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. మండల జనసేన అధ్యక్షుడు తోట చిన్నారి, మాదాసు శ్రీను, కటకం కొండ, గరికపాటి బాలాజీ, అడపా బాబీ, పెన్నేరు చంటి, శాంతి శ్వరూప్, టీడీపీ నాయకులు పి.రమేష్, గరికపాటి వెంకటేశ్వరరావు, పామర్తి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీతో ఎమ్మెల్యేలు కాగిత, వర్ల భేటీ

మచిలీపట్నం టౌన్ : జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మిని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాంతిభద్రతల పరిరక్షణపై చర్చించారు.

వంద రోజుల్లో గుడివాడను అభివృద్ధి బాట పట్టిస్తా

● గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, జూన్ 15 : నియోజకవర్గాన్ని 100 రోజుల్లో అభివృద్ధి బాట పట్టిస్తానని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గుడ్లవల్లేరు, నందివాడ మండలాల రెవెన్యూ, వివిధ శాఖల అధికారులు శనివారం వెనిగండ్లను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల వారీగా నెలకొన్న సమస్యలను వీఆర్వోలు ఆయనకు వివరించారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ నాయకులు, రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



గుడివాడ ప్రభుత్వాసుపత్రిలో రోగులను సౌకర్యాలపై అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెనిగండ్ల, రావి

ప్రైవేటు వైద్యశాలలకు ధీటుగా ప్రభుత్వాసుపత్రి

ప్రైవేటు వైద్యశాలలకు ధీటుగా ప్రభుత్వాసుపత్రి నిలుపుతామని, నాణ్యమైన వైద్యసేవలను అందిస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు.స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రిని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుతో కలిసి సందర్శించారు. తొలుత ఆసుపత్రి సూపరిటెండెంట్ ఇందిరాదేవి ఆయనకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో సిబ్బంది కొరత, వసతుల కల్పనపై నివేదిక ఇవ్వాలని వైద్యాధికారులను కోరారు. మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బొకేలొద్దు..నోట్ పుస్తకాలతో రండి

గుడివాడ : తనకు శుభాకాంక్షలు చెప్పేందుకు నాయకులు, అభిమానులు పూలమాలలు, శాలువాలను తీసుకురావద్దని, నోట్ పుస్తకాలను తీసుకురావాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభిమానంతో వచ్చే పార్టీ శ్రేణులు డబ్బులు వృధా చేయవద్దని, పేద విద్యార్థులకు అవసరమయ్యే నోట్ పుస్తకాలను తీసుకురావాలని ఎమ్మెల్యే వెనిగండ్ల కోరారు.



కుమ్మమూరు విజయోత్సవంలో ఎమ్మెల్యే కుమార్‌రాజా

కుమ్మమూరులో విజయోత్సవం

తోట్లవల్లూరు : కుమ్మమూరులో వీరపనేని శివరామ్, రామినేని కుటుంబయ్య ఆధ్వర్యంలో శనివారం విజయోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. తాడిశెట్టి నరేష్, వీరంకి వెంకట గురుమూర్తి, వీరపనేని శివరామ్, చింతపల్లి వెంకటేశ్వరరావు, చలసాని కాశీ, గూడపాటి గిరిబాబు, వీరంకి వరహాలరావు, ఎంపీటీసీ సభ్యుడు నర్రా వెంకట అప్పారావు, సర్పంచ్ మూడే శివశంకర్, ఉపసర్పంచ్ వీరంకి పరశురామ్ పాల్గొన్నారు. **పామర్రు :** నూతన ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజలకు సేవలందించాలని పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. పట్టణంలోని ఐదు సచివాలయాల ఉద్యోగులు, సిబ్బంది, మండల వ్యవసాయశాఖ సిబ్బంది ఎమ్మెల్యే కుమార్‌రాజాను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.



ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు అవనిగడ్డ ప్రభుత్వ కళాశాల అధ్యాపకుల సత్కారం

అవనిగడ్డ : ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమారాణి శనివారం ఘనంగా సన్మానం చేశారు. మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి ప్రిన్సిపాల్ సత్కరించారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా పృథ్వీశ్వరక్షేత్రం వార్షికోత్సవాలు



చల్లపల్లి : నడకుదురు పృథ్వీశ్వర స్వామి ఆలయానికి రాజగోపురం నిర్మించి, పాటలీవనాల ఆవరణలో అష్టాదశ శక్తిపీఠాలు, ద్వాదశ జ్యోతిర్లింగాల దేవతామూర్తులను ప్రతిష్ఠించి రెండేళ్లు అయిన సందర్భంగా ద్వితీయ వార్షికోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కుటుంబ సమేతంగా పాల్గొని పూజలు చేశారు. ఈవో యార్లగడ్డ శ్రీనివాసు ఆధ్వర్యంలో కంతం రాజు సాయి గణపతి దీక్షితులు నేతృత్వంలో పండితులు బుద్ధప్రసాద్-విజయలక్ష్మి, మండలి వెంకట్రామ్-సాయిసుప్రియ దంపతులను ఘనంగా సత్కరించారు. దేవస్థానం సమగ్ర అభివృద్ధిప్రదాత మండవ రవీంద్ర, ప్రముఖులు నాదెళ్ల ప్రభాకరరావు, నాదెళ్ల వెంకట నరసయ్య, యార్లగడ్డ శ్రీనివాసరావు, మాలెంపాటి శ్రీనివాసరావు, గుత్తికొండ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ నిలుపుదల చేయాలని ఆందోళన

మోపిదేవి : సెల్ టవర్ పనులను వెంటనే నిలుపుదల చేయాలంటూ వెంకటాపురం ఎస్సీ కాలనీ వాసులు మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల వద్ద శనివారం ఆందోళన చేపట్టారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో రామలింగేశ్వరరావు, తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మోపిదేవి శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. కె.జనార్దనరావు, నలుకుర్తి సుధీర్ కుమార్, జస్సిరేచల్, విక్టర్ బాబు, గోరిపర్తి వేణుగోపాల కృష్ణ, రమేష్ తదితరులు ఉన్నారు.

పురుగు మందుతాగి ఆత్మహత్య

కోడూరు : పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన విశ్వనాథపల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన బత్తుల బాబులు (40) శుక్రవారం పురుగుల మందు తాగటంతో స్థానికులు అతని భార్య సహాయంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెం దాడు. మృతుడి భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.శిరీష తెలిపారు.

రక్తదాతలకు సత్కారం

మచిలీపట్నం టౌన్ : చిలకలపూడి అర్బన్ హెల్త్ సెంటర్‌లో శనివారం రక్తదాతలను సత్కరించారు. హెచ్‌వోడీ డాక్టర్ శివయ్య, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ సంధ్య, డాక్టర్ సుస్మిత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు శ్రావణి, విజయకృష్ణ, శ్రావ్య పాల్గొన్నారు. రక్తదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు.

హోంగార్డు మృతికి ఎమ్మెల్యే కాగిత సంతాపం

బంటుమిల్లి : అకాల మరణం చెందిన అర్తమూరు గ్రామానికి చెందిన హోంగార్డు కాగిత పోతురాజు భౌతికకాయానికి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. బొర్రా కాశీ, యార్లగడ్డ శ్రీనివాసరావు, జొన్నలగడ్డ కొండ, కేదార్, భూపతి రమేష్, ఎస్సై వాసు, పోలీసు సిబ్బంది తదితరులు పోతురాజు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

నేత్రపరీక్షా శిబిరం

చల్లపల్లి : చల్లపల్లి లయన్స్‌క్లబ్ వీఆర్‌కె నగర్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర పరీక్షా శిబిరం జరిగింది. డాక్టర్ వెంకట్రావ్ 53 మందిని పరీక్షించి 15 మందిని శుక్లాల ఆపరేషన్‌కు ఎంపికచేశారు. అడపా గురవయ్య, రాంబాబు తల్లి దండ్రులు అడపా వెంకట రామయ్య...నాంచారమ్మ జ్ఞాపకార్థం ఆర్థిక సహకారం అందించారు. శిబిరాన్ని లయన్స్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మోపిదేవి వెంకటేశ్వరరావు, రాయపాటి రాధాకృష్ణ, నర్రా సాయిబాబు, ఎంవి వి.కృష్ణారావు పర్యవేక్షించారు.

డాక్టర్ పురుషోత్తం మృతి పేదలకు తీరని లోటు

బంటుమిల్లి, జూన్ 15 : పేదల వెద్యుడిగా పేరొంది, 40 సంవత్సరాలుగా వైద్యసేవలందించిన డాక్టర్ పురుషోత్తం (64) శుక్రవారం రాత్రి మృతి చెందారు. డాక్టర్ పురుషోత్తం మరణం పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు తీరని లోటు అని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, టీడీపీ నేత బూరగడ్డ వేదవ్యాస్, జనసేన నేత సతీష్ తదితర ప్రముఖులు పేర్కొంటూ ఆయన మృతికి సంతాపం తెలిపారు. పిఠాపురం నుంచి బంటుమిల్లి 40 ఏళ్లుగా ఆర్‌ఎంపీ డాక్టర్‌గా బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల ప్రజలకు అతి తక్కువ ఫీజుతో వైద్య సేవలు అందించారని పేర్కొన్నారు. మందులకు డబ్బులు లేకపోయినా, చార్జీలకు డబ్బు తగ్గినా ఆయనే డబ్బు ఇచ్చి పంపడం ఆయన సేవా దృక్పథానికి నిదర్శనమన్నారు. సామాజిక స్పృహతో కూడిన పలు సేవా కార్యక్రమాలలో డాక్టర్ చురుగ్గా పాల్గొనేవారన్నారు. బంటుమిల్లి మెడికల్ షాప్ అసోసియేషన్ సభ్యులు , బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు ప్రముఖులు డాక్టర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

